క్లుప్తంగా

నేడు తాలాడలో 'గడపగడపకు..'

సీతంపేట: మండలంలోని తాలాడ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

పాడిపశువుల సంరక్షణపై అవగాహన

పాలకొండ: వేసవిలో పశువుల సంరక్షణపై పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని మండల పశువైద్యాధికారి బి.సిద్ధార్థ అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో సోమవారం వైఎస్సార్ పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. పాల దిగుబడి పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

120 మందికి వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మానస

వీరఘట్టం: మండలంలోని కుమ్మరిగుంటలో సోమవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి డాక్టర్ మానస వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వేసవిలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చక్రధరరావు, వైద్య సిబ్బంది రమణమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పూజలు చేస్తున్న ఎంపీపీ, తదితరులు

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో లోఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికిందని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. సోమవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఎంపీపీ కొబ్బరికాయ కొట్టగా, సర్పంచ్ దమలపాటి ఉమ, ఏఈ బాలాజీ, లైన్‌మెన్ సంతోష్‌కుమార్ స్విచ్ ఆన్‌చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

6 నుంచి వాలీబాల్, కబడ్డీ పోటీలు



జేసీబీతో మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం

వీరఘట్టం: వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 6 నుంచి స్థానిక జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ మేరకు సోమవారం క్రీడా మైదానాన్ని జేసీబీతో చదును చేశారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో తాలాడ విద్యార్థినికి స్వర్ణం



ఇందుకీర్తికను అభినందిస్తున్న రెడ్డి శివకుమార్

భామిని: తాలాడకు చెందిన విద్యార్థిని వలరౌతు ఇందు కీర్తిక రాష్ట్రస్థాయి ఉషూ బంగారు పతకం సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చింది. ఈ నెల 23న గుంటూరు జిల్లా నల్లపాడులో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ ఉషూ చాంపియన్‌షిప్–2023లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా తరఫున పాల్గొని 70 కిలోల విభాగంలో విజేతగా నిలిచింది. పూణేలో వచ్చే నెల 30న జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఆమెను ఉమ్మడి జిల్లా ఉషూ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి శివకుమార్, భామిని కేజీబీవీ ఎస్‌ఓ బి.శారద, తదితరులు సోమవారం అభినందించారు.

చిరుజల్లులతో ఉపసమనం

పాలకొండ: మండలంలో పలుచోట్ల సోమవారం సాయంత్రం తేలికపాటి జల్లులు కురిశాయి. వేసవి ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మండల ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనాన్ని ఇచ్చింది. చల్లని గాలులతో వాతావరణం ఆహ్లాదంగా మారింది.

అందరికీ సంక్షేమం.. అదే జగనన్న అభిమతం

- పార్టీలకు అతీతంగా పథకాలు అందజేత
- నవరత్నాలతో పేదలు ఆర్థికంగా బలోపేతం
- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. చినమేరంగిలోని తన నివాసంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏప్రిల్ 7వ తేదీ నుంచి జగనన్నే మాభవిష్యత్ మెగా పీపుల్స్ సర్వే చేపట్టామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. కురుపాం నియోజకవర్గంలో 77వేల హౌస్‌హోల్డ్ కార్డులుంటే 50వేల వరకు ఇప్పటికే మద్దతు తెలిపారన్నారు. కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి సర్వేచేస్తే మంచి స్పందన వస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏ సంక్షేమ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీపేరుతో దళారీ వ్యవస్థ ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దళారీ వ్యవస్థను రూపుమాపి సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడమే కాకుండా మేనిఫెస్టోలో తీసివేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'నవరత్నాలు'ను అమలు చేస్తున్నామన్నారు. జగనన్న ప్రతీ ఆలోచన ప్రజల కోసమేనని, పరిపాలనా విధానం ప్రజల కోసమేనని, ప్రతీ అంశం పేద, బడుగు, బలహీన వర్గాల కోసమేనని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనత సాధించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జియ్యమ్మవలస జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, మండల కన్వీనర్ గౌరీశంకరరావు ఉన్నారు.

గడపగడపకూ జగనన్న పథకాలు



సీఎం జగన్‌కు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

భామిని: రాష్ట్రంలో సుమారు కోటికిపైగా కుటుంబాలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతుగా మిస్డ్‌కాల్ ఇచ్చారని, భామిని మండలం నుంచి పదివేలకు పైగా కుంటుంబాలు ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తోట సింహాచలం, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ.. మండలంలో 27 పంచాయతీల పరిధిలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రతీ ఒక్కరూ ప్రభుత్వ పనితీరు బాగుందని తెలిపారన్నారు. అలాగే సీఎం జగన్‌కు మద్దతిస్తూ..ఆయన ఫొటోలను తమ ఇంటి గోడలకు అతికించుకున్నారన్నారు. భామిని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, పెద్దదిమిలి, బురుజోల సర్పంచ్‌లు తోగరాన శ్రీను, మడపాన కేశవ, పార్టీ నాయకులు శివ్వాల తిరుపతి, రొక్కం రమేష్, కొళ్ల రామారావు, గేదెల మోహన్, పోతల మజ్జి, నాయకులు పాల్గొన్నారు.

రోగులకు అసౌకర్యం కలిగించొద్దు



ఓపీ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కొమరాడ: విద్యుత్ సరఫరా నిలిచిపోయినపుడు రోగులు అసౌకర్యానికి గురికాకుండా జనరేటర్‌ను అందుబాటులో ఉంచాలని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. మండలంలోని కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఇన్ పేషెంట్స్, అవుట్ పేషెంట్స్ రికార్డులు, వార్డులను పరిశీలించారు. మందుల నిల్వలపై ఆరా తీశారు. రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు.

మలేరియా నిర్మూలనే లక్ష్యం



వెద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఫణికుమార్, సిబ్బంది

భామిని: అన్ని గ్రామాలను మలేరియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని భామిని వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఫణికుమార్ కోరారు. మండలంలోని బొమ్మికలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25న జాతీయ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ విద్యార్థుల హెల్త్ రికార్డులు తనిఖీలు చేశారు. ఆయన వెంట సీహెచ్‌ఓ భాస్కరరావు, మలేరియా యూనిట్ అధికారి అప్పారావు, ఏఎన్‌ఎం జీవితా సాహూ, హెచ్‌ఏ మధు ఉన్నారు.

మొబైల్ చలివేంద్రం ఏర్పాటు

పాలకొండ: స్థానిక సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో మొబైల్ చలివేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి ప్రతినిధులు కె.సుధాకర్ మాట్లాడుతూ వేసవిలో పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు మొబైల్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణంలోని ప్రధాన సెంటర్లు వద్ద వేసవిలో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రమానంద్, తవిటిరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు వ్యవసాయ సలహా మండలి సమావేశం

సీతంపేట: వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఈనెల 26న తోటపల్లి ఉద్యానవన కళాశాలలో ఉన్నత పర్వత శ్రేణీ విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించనున్నట్లు సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.సురేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించిన ప్రణాళికలు, చర్చా గోష్ఠి ఉంటుందన్నారు.

జ్వరాలు తగ్గేంతవరకూ వైద్య సేవలు

సీతానగరం: మండలంలో జ్వరాలు తగ్గుముఖం పట్టేవరకూ వైద్యసేవలు అందిస్తామని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ భాస్కరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో రెడ్డివానివలసలో జరుగుతున్న ఉచితవైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ ప్రభుత్వం అన్నిరకాల వ్యాధుల నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచిందన్నారు. గ్రామాల్లో పూర్తి స్థాయిలో జ్వరాలు తగ్గేంతవరకూ క్షేత్రస్థాయిలో సిబ్బంది ఉంటారని చెప్పారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం సమృద్ధి దిశగా పంచాయతీలు

- ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం
- ఉత్తమ పంచాయతీలకు అవార్డుల ప్రదానం

పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో జాయతీ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటుతో పంచాయతీల అభివృద్ధికి బీజం పడిందని, స్వయం సమృద్ధిని సాధిస్తున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో వివిధ విభాగాల్లో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన పంచాయతీలకు అవార్డులు అందజేశారు. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు.

- సాక్షి నెట్‌వర్క్



గరుగుబిల్లి: ఉత్తమ ఎంపీపీ రామారావును సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్



కురుపాం: మౌలిక వసతుల విభాగంలో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకుంటున్న సర్పంచ్ లోకనాథం



పాలకొండ రూరల్: వెలగవాడ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌ను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ, ఎంపీడీఓ, సర్పంచ్‌లు



సీతంపేట: ఎంపీపీని సన్మానిస్తున్న ఎంపీడీఓ సత్యం



భామిని: కోసలిలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు



జియ్యమ్మవలస: ఉత్తమ పంచాయతీల సర్పంచ్‌లను సత్కరిస్తున్న ఎంపీడీఓ రమేష్



కొమరాడ: తొడుము సర్పంచ్ యేగిరెడ్డి సింహాచలంను సన్మానిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, తదితరులు



కొమరాడ: కోటిపాం సర్పంచ్ సుంకరి సుగుణను సత్కరిస్తున్న ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు



గరుగుబిల్లి: ఉత్తమ సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సన్మానం చేస్తున్న ఎంపీడీఓ గోపాలరావు

స్పందన సమస్యలు తక్షణమే పరిష్కరించండి

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గిరిజన స్పందనకు వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి అన్నారు. స్థానిక ఐటీడీఏలో సోమవారం గిరిజన స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ సవర భాషా వలంటీర్లు వినతిపత్రం అందజేశారు. చిన్నంచల గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, సూదిరాయికొండ గ్రామానికి తాగునీరు అందించాలని ఆయా గ్రామస్తులు కోరారు. అలాగే మెర్లిపేటకు అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని, నల్లబొంతులో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు వినతులు అందజేశారు. కోతాం వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని, టార్పాలిన్లు, గ్రావిటేషన్ పైపులు, బీటీరోడ్డు మంజూరు చేయాలని పలువురు వినతులు అందజేశారు. రసూల్‌పేటకు చెందిన చామంతి అనే బాలింతకు తమ బిడ్డకు పాలప్యాకెట్లు ఇప్పించాలని కోరాగా.. సంబంధిత అధికారులు తక్షణమే వాటిని పంపిణీ చేశారు. స్పందనలో ఏపీఓ రోషిరెడ్డి, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఈఈ మురళి, ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ యుగంధర్, సీడీపీఓ రంగలక్ష్మి, పీఏఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్ సూర్యనారాయణ

పాలకొండ రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుతోపాటు అభివృద్ధిపై ఉపాధ్యాయులు మరింత దృష్టి సారించాలని ఎంఈఓ మీసాల సూర్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని హెచ్‌ఎంలకు సోమవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ రిసోర్సుపర్సన్లు గారాల సూర్యనారాయణ, కె.జనార్దనరావు పాఠశాలల సామాజిక తనిఖీలపై పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు, ప్రజలు, తల్లితండ్రుల, పాఠశాలల అభివృద్ధి కమిటీలు సంయుక్తంగా నిర్వహించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. సమగ్ర పాఠశాల మూల్యాంకనం అనే యాప్‌లో నమోదు చేయాల్సిన వివరాలు తెలియజేశారు. ఈ నెల 28 నాటికి శతశాతం నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. హెచ్‌ఎంలు జామి రవి, జి.రేణుకాదేవి, ప్రతాపరుద్రుడు, వి.లక్ష్మణరావు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో దేశానికి ప్రమాదం



ప్రచార బహిరంగ సభలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

పాలకొండ రూరల్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించకుంటే దేశానికి ప్రమాదం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు అన్నారు. పాలకొండ ఆటో స్టాండ్‌లో సోమవారం ప్రచారం భేరి, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వామక్ష నాయకులు మాట్లాడుతూ బీజేపీని నమ్మితే రాజకీయ పార్టీలకే కాకుండా ప్రజలకు తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బహుళజాతి, కార్పొరేట్ రంగాలు అందలమెక్కితే.. సామాన్యులు అధోగతి పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అన్ని వర్గాలవారు సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే రాష్ట్రంలో విశాఖ ఉక్కును కాపాడుకోవటం, పోలవరం, రాజధాని నిర్మాణం తదితర అంశాలకు సంబంధించి కేంద్రం నుంచి నిధులు సాధించుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఎం.తిరుపతిరావు, దావాల రమణరావు, కాద రాము, జి.జనార్దనరావు, సుందరమ్మ తదితరులున్నారు.

ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించాలి

- డీఐఓ డాక్టర్ టి.జగన్మోహనరావు



అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య పర్యవేక్షణ రికార్డులు పరిశీలిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

కురుపాం: ఏజెన్సీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అందిస్తున్న వైద్యసేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఇమ్యునైజేషన్(డీఐఓ) అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు సూచించారు. మండలంలోని మొండెంఖల్, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గుమ్మ, పిలేవిడి, కొండబారిడి గ్రామాలను సోమవారం ఆయన సందర్శించారు. క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. మాతాశిశు సంరక్షణ కార్డులు, టీకా కార్డులు పరిశీలించి పూర్తిస్థాయిలో నమోదు తప్పనిసరిగా చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారుల ఆరోగ్య పర్యవేక్షణ చేసి హెల్త్‌కార్డులను పరిశీలించారు. ఐరన్ సిరప్స్, మాత్రలు అందుబాటు ఉంచి సరఫరా చేయాలని సూచించారు. అనంతరం గిరిజన సంక్షేమ వసతిగృహాలను, హెల్త్ వెల్నెస్ కేంద్రాలను సందర్శించారు. ఆయన వెంట వైద్యాధికారులు బి.ప్రజ్ఞ, కె.వెంకట హర్ష, పి.అభినవ్‌కుమార్, కె.అమర్‌సింహారెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రగతిని వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..

- ఉత్సాహంగా సాగిన 'గడపగడపకు మన ప్రభుత్వం'
- పాల్గొన్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



బిత్రపాడు పంచాయతీ బట్లభద్రలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: వైఎస్సార్‌సీపీ పాలనలో సాధించిన ప్రగతిని వివరిస్తూ.. స్థానికుల సమస్యలు తెలుసుకుంటూ ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బిత్రపాడు పంచాయతీ బట్లభద్ర, సీమనాయుడువలస, బిత్రపాడు గ్రామాల్లోలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే, పార్టీ నాయకులకు మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అందించలేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. ఇలాంటి నాయకుడు సీఎంగా ఉంటే ప్రతీ ఇళ్లు సుభిక్షంగా ఉంటుందన్నారు. ఇచ్చిన మాట కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

అడగకుండానే అన్నీ ఇచ్చారు..

గత ప్రభుత్వంలో పింఛన్ పొందాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులైతే చాలు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇంటి స్థలాలతో పాటు రూ.లక్షల విలువైన సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. అడగకుండానే అన్నీ ఇస్తున్న జగనన్నకు ఓటుతో రుణం తీర్చుకుంటామని ప్రజలు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి చెప్పడం గమనార్హం. జగనన్న లాంటి నాయకులు మరో 30 ఏళ్లపాటు అధికారంలో ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు ప్రతీ ఇళ్లు సంక్షేమ పథకాలతో కళకళలాడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు, ఏపీఎంఎస్ఎంఈ డైరెక్టర్ మూడడ్ల గౌరీశంకరరావు, జెడ్పీటీసీ శశికళ, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయకులు అల్లు రాజేశ్వరరావు, అల్లు ఈశ్వరరావు, బలగ వెంకటరమణ, మరడాన కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు అవార్డులు అభినందనీయం



మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి పద్మావతి

కురుపాం: మండలంలోని పలు పంచాయతీలు ఉత్తమ పంచాయతీలుగా గుర్తింపు పొందడం హర్షణీయమని ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వి.శివరాప్ప ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పంచాయతీలు పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల కల్పన, పేదరిక నిర్మూలన, జల సంరక్షణ, ఆరోగ్యం, పచ్చదనం తదితర విభాగాల్లో ప్రగతి కనబరుస్తున్నాయన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, మండల కన్వీనర్ గౌరీశంకరరావు, సచివాలయ సిబ్బంది, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.